# జులై 7

"సూరిబాబు"



కారు బయలు దేరబోతోంది, ఇంతలో హడావిడిగా నర్సు వచ్చి, ''డాక్టర్'' అని పిలిచింది. యాక్సిలరేటర్ మీదనుంచి కాలు ప్రేకు మీదకు మళ్ళింది.

''ఏం విజయ, నువ్వుకూడా సిటీకి వస్తావా?'' అని డాక్టరు అడిగాడు.

''నాకు యింకా డ్యూటీ వుంది డాక్టర్.

''శంకర్'' అని పిలు

''ఇక్కడ అల్లా పిలవలేను''

''ఎందుకని ?''

''ఇక్కడమీరు పెద్ద డాక్టరు. నేను జూనియర్ నర్సుని''

''ఇతరుల దృష్టిలో కావచ్చు, నువ్వు నన్ను శంకర్ అని పిలుస్తేనే ఆనందం''

''అల్లాగే డాక్టర్''

''అదుగో మళ్ళీ''

''మరచిపోయాను శంకర్''

''ఇంతకూ యిద్దరం అసలు విషయం మరచిపోయాం''

''ఏమిటది''

''ఆ ప్రశ్న వేయవలసింది నేను. . .బయలు దేరబోతూంటే ఆపిందెవరు ?''

''నేనే''

''ఎందుకనో ?''

''ఈరోజు వుదయం వచ్చాడే పేషెంటు''...

''చాలామంది వచ్చారుగా''

''ఆపరేషన్ కోసం వచ్చాడు నెంబరు 22. అతను మిమ్మల్ని ఒక్కసారి చూడాలనుకుంటు న్నాడు''

''సాయంకాలం రౌండ్సుకు వచ్చినప్పుడు చూస్తాను''

''కాదు శంకర్, ప్లీజ్''

''సరే, పద, నువ్వంతగా చెబుతున్నప్పుడు వెళ్లక తప్పుతుందా ? రాణిగారి ఆజ్ఞ' అంటూ కారుదిగి రోగిదగ్గరకు వెళ్ళాడు.

''ఎల్లా వుందయ్యా ?'' అని అడిగాడు.

అతనేం మాట్లాడలేదు. రెప్పవాల్చకుండా యితని వంకనే చూస్తున్నాడు. ముఖంలో అంతు లేని భయం కనిపిస్తోంది. చివరకు

''శంకర్'' అని అన్నాడు డాక్టరు ముఖంలో ఏం చెలనం లేదు.

''శంకర్!'' అని మళ్ళీ అన్నాడు.

''ఁవును శంకర్నే''

నేను బ్రతకను.

నన్ను చంపేస్తావు.

''నేను వైద్యం నేర్చుకుంది నిన్ను చంపడం కోసంకాదు''

''నాకు భయం వేస్తోంది''

''జాగ్త్ర, భయం నుంచి దూరంగా వుండు. లేకపోతే అదే నిన్ను కబళిస్తుంది''

''నన్ను యిక్కడ నుంచి ఇంకొక హాస్పిటలకు పంపించేశేయి''

''అది నాచేతుల్లో లేదు.''

''నేను యిక్కడ ఒక్కక్షణం వుండలేను''

''ఎందుకని ?''

''నువ్వు నన్ను చంపేస్తావు. నీకోపం నాకు తెలుసు''

''చూడు రాము. శంకర్ నిన్ను చంపవచ్చు. కాని యిక్కడ వున్నది డాక్టర్ శంకర్''

''ఎవరైతేనేం నాకు యిద్దరు ఒకటే, నన్ను వదలిపెట్టు రోగంతో, కృంగి కృషించినా నామీదనా నీపగ ?'' అంటూ రెండు చేతులు జోడించి నమస్కారం చేశాడు.

శంకర్ ఏం మాట్లాడలేదు, సరాసరి వచ్చి కారులో కూర్చుని, కారు స్టార్టు చేశాడు.

వెనక సీటులో కూర్చున్న విజయ ''అపు శంకర్'' అని అంది. కాని కారు ఆగలేదు. సరాసరి సముద్రపు ఒడ్డుకు వెళ్ళి ఆగింది. కారు దిగి నీటి అంచున నిలబడ్డాడు.

''శంకర్'' అని విజయ పిలిచింది.

అతను పలకలేదు.

పిలుపు మళ్ళీ రెట్టించింది. ఈసారి అతనిలో చలనంకలిగింది. పిలుపువచ్చిన దిక్కుకు చూశాడు. ముఖంలో బాధ కనిపిస్తోంది.

''శంకర్ ఏం జరిగింది'' అని చిన్నదాని కంఠం గద్గదంగా పలుకరించింది. అపిల్ల చెయ్యి పుచ్చుకుని

''విజ్జి నన్ను ఎప్పుడు వదిలి పెట్టనని మాట యియ్యి''

''ఏమిటది శంకర్''

''ముందు ప్రమాణం చెయ్యి''

''ప్రమాణం చేస్తున్నాను. మీ పాదసాక్షిగా మిమ్మల్ని ఎప్పుడు వదిలిపెట్టను''

''నిజమేనా ?''

''నిజమే. ముమ్మాటికి. ఇంతకూ ఏం జరిగిందో చెప్పవూ!''

''దయచేశి నన్నేం అడగవద్దు''

రాత్రి యింటికి తిరిగి వచ్చేసరికి ఎనిమిది దాటింది. వరండాలో నౌకరు గోవిందు కనబడి ''మీకోసం ఎవరో వచ్చారు'' అని అన్నాడు.

డ్రాయింగు రూములో ఎవరో కూర్చొని, ఏదో పత్రిక పుటలు తిరగ వేస్తున్నారు. కొద్ది క్షణాలు పరకాయించి చూశి, ఏం మాట్లాడకుండా కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. ఆవిడ లేచి వచ్చి, యితని దగ్గరగా నిలబడి మెల్లిగా

''శంకర్'' అని పిలిచింది.

''మళ్ళీ ఎందుకొచ్చావు ?''

''ప్రాణభిక్ష పెట్టమని ప్రార్థించడానికి''

''ఎవరికి ? ప్రాణం తీశిన వారికా, ప్రాణం' తీయించిన వారికా!

ఆవిడకు, యింతవరకు, దాగినశోకం, కట్టలు తెగింది.

''వారిని రక్షించు శంకర్''

''రక్షించనని నీకు భయమా ?''

''వారే నాసర్వస్వం. వారి కేదైనా జరిగితే' నేను ఒక్కక్షణం బతకలేను''

''వెళ్ళిపో. యిక్కడ నుంచి వెళ్ళిపో.''

'నువ్వు మాట యిస్తేనేగాని వెళ్ళను'''

''మాట యివ్వాలి? నాకు యిచ్చిన మాటలన్ని ఏం చేశావు కమలా ?''

''పాపిష్టిదాన్ని, నిలుపుకోలేకపోయాను'

''అని యిప్పుడంటున్నావు''

''నన్ను ఏమైనా అను, కాని వారిని రక్షించు'

''నేను చెయ్యగలిగింది ఏం లేదు.''

''అల్లా అనవద్దు. ఈ దేశంలో నువ్వు తప్ప ఎవ్వరు ఆయన్ని రక్షించలేరు''

''మనిషిని మనిషి రక్షించలేడు కమలా! దైవానికే ఆ శక్తివుంది''

''నువ్వు దైవానివే. ఎందరి ప్రాణాలో రక్షించావు''

''వారికి నాయందు పూర్తి నమ్మకం వుంది. వారు నాకు నిప్పుడు ఏ అపకారం చెయ్యలేదు''

''మేము చేశామా ?''

''మరచి పోవడం నీకు సహజమే. నేను లండను వెళ్ళేరోజు నాతో ఏమన్నానో గుర్తుందా! ఎన్ని యుగాలైనా నీకోసం ఎదురుచూస్తూవుంటాను. ఈ కమల హృదయంలో శంకరుకు తప్ప వేరొకరికి స్థానం లేదని! నువ్వే అడక్కుండానే మాట యిచ్చావు. 'శంకర్ కమలకు ఏలోటు రానివ్వకు అన్నివిధాలా తోడుగా వుంటాను. అని రాము మాట యిచ్చాడు. అప్పటికి కాని నామనస్సుకు శాంతి చేకూరలేదు. ఇంగ్లండు వెడుతున్నాను. ఏదైనా క్రొత్తవిషయం క్రొత్తచికిత్స పద్ధతి ఏదైనా కనుక్కోగలుగుతే నాజీవితం ధన్యం అవుతుందని ఆశపడ్డాను. ప్యాస్‌పోర్టు వచ్చినరోజున ఎంతసంబరపడ్డాను. మనమంతా పెద్దపార్టీ చేసుకున్నాం. ఆనాటి రాత్రి, తోటలో వెన్నెలలో మనం ఏకాంతంగా వున్నప్పుడు ఏమన్నావో జ్ఞాపకం వుందా! నా అంత అదృష్టవంతురాలు ఎవరూ లేరు. నాజీవితం యిల్లాగే గడిచిపోతే చాలు. నాకేం అక్కర్లేదు.

నేనూ నా అంత అదృష్ట వంతుడు యీజగత్తులో లేడని గర్వపడ్డాను. విదేశాలు వెడుతున్నానని సంబరమేకాని, బయలుదేర వలసినరోజు దగ్గరకు వస్తుంటే, ఏదో చెప్పలేని దిగులు, ఒంటరి తనం నన్ను బాధించేవి. నేను వెళ్ళేరోజున ఆడదానివి కనుక, కంట తడిపెట్టగలిగావు. నేను మొగవాడిని నాకు ఆ అదృష్టం లేదు.

మొదటి ఆరు నెలలు ఎంతగడ్డుగా గడిచాయో నీకు తెలుసు. అంతులేని ఒంటరి తనం. దేశం కాని, దేశం, వీటితో సతమత మయ్యాను. ఆ రోజున ఒక పెద్ద ఆపరేషను చేశాము. బ్రతకడేమోననుకున్న వ్యక్తిని, మృత్యువు నుంచి కాపాడాం. ఆపరేషన్ థియేటరు నుంచి, బయటకు రాగానే నేను అడిగిన మొదటి ప్రశ్న. ఈ రోజు తారీఖు ఎంత ? జూలై 7 అని నర్సు చెప్పింది. వెంటనే పిచ్చివాడిలాగా బజారుకు పరుగెత్తాను. ఒక ముత్యాలహారం కొన్నాను నీ కోసమే. ఆనాడు నీ పుట్టినరోజు, మనం మొట్టమొదట కలుసుకున్నది కూడా, నీ పుట్టినరోజు పండుగనాడే.

ముత్యాల హారంతీసుకుని యింటికి వచ్చాను. అక్కడ మీ శుభలేఖ నాకోసం, నా ఆశలు, అడియాశలు చెయ్యటానికి సిద్ధంగా వుంది. అది నాకు చేరేసరికే, మీరు దంపతులై ఆరు రోజులైంది. అప్పటి నాపరిస్థితి నీకు ఎట్లా చెప్పను.

ఇంతకాలం ప్రాణంతో సమానంగా ప్రేమించిన ప్రియురాలు, ప్రాణం కంటె ఎక్కువను కున్న స్నేహితుడు, ఒక్కసారి పరాయివాళ్ళై పోయారు. ఏడాదిలోనే యింతమార్పు, నేనంటే యింత అలక్ష్యం. నాతో చేశిన స్నేహం, చెప్పిన మాటలు అన్ని బూటకం, రాము రాశిన ఉత్తరం నన్ను చిత్రవధ చేశింది. మీరు అప్పటికే ఎన్నోరోజులనుండి ప్రేమించుకున్నారట. తన మీదనే కమలకు ఎక్కువ ప్రేమట. మీరు వివాహం చేసుకోవటం నాకు సమ్మతమే. కాని



మీరుచేసిన ద్రోహాన్నినేను క్షమించలేకపోయాను. ఆనాడే రాము ఎదురైతే హతమార్చేవాడిని. కాని దేశం వదిలి వెళ్ళటానికి కూడా నాకు స్వతంత్రం లేదే. ఉన్న స్వతంత్రమల్లా ఒక్కటే ఆత్మహత్య. చచ్చిపోదామని బయలుదేరుతూ వుంటే దైవం నన్ను రక్షించాడు. వెంటనే రమ్మని హాస్పిటలు నుంచి ఫోనువచ్చింది.

డాక్టర్ థామస్ ఒక్కడే నన్ను అర్థంచేసుకోగలిగింది. మనసు విప్పి ఆయనతో అంతా చెప్పివేశాను. ఆయన ఒక్కటే మాట అన్నాడు. "మానవ జన్మను మహోత్కృష్టమైన ఘన కార్యాలు సాధించటానికి, అల్పమైన చింతలలో, క్లేశాలతో, నాశనం కావడంకోసం కాదు. ఆరోజే శంకర్ నశించాడు. డాక్టర్, శంకర్ పుట్టివించాడు.

మారిపోయిన నా జీవితంలోకి మళ్ళీ పీడ కలలాగా వచ్చావు. నువ్వు వెళ్ళిపో. నాకు మళ్ళీ కనిపించవద్దు. మీరు కనపడితే నాలో కోపం ఆగదు. ఇప్పుడిప్పుడే నా జీవితం కోలుకుంటూంది మళ్ళీ మంచిరోజులు వచ్చే ఆశలున్నాయి. దాన్ని నాశనం చెయ్యవద్దు."

"ఎవరా అదృష్టవంతురాలు ?"

"నీకు ఎప్పుడూ చెప్పను...రాముకేం ఫర్వాలేదు."

"నేను చేయగలిగినదంతా చేస్తాను. కాని ఒక్క మాట నీ రికమండేషన్ వల్ల నేను రాముకి ప్రత్యేకంగా చెయ్యగలిగింది, చేసేది ఏంలేదు" ఓ రోగికి వైద్యుడుగా చేయవలసిన దంతా చేస్తాను."

"శంకర్"

వెళ్ళిపో. . . . .ప్లీజ్.

"వెడుతున్నాను శంకర్. కాని ఒక్కమాట నమ్ము, నామనస్సులో యిప్పటికీ, నీ యందు ప్రేమ వుంది"

"చాలు కమలా, నాకుచేసిన ద్రోహం చాలు, రాముకి కూడా ద్రోహం చేయవద్దు"

"ద్రోహమా ?"

"అవును ద్రోహమే. ఆనాడు నువ్వు అవివాహితివి, నీయిష్టం వచ్చిన వారిని ప్రేమించడానికి, నీకు హక్కుంది. ఈనాడు నాస్నేహితుడి యిల్లాలివి. అతనికి అన్యాయం చేస్తే నేను కాదు. భగవంతుడు కూడా నిన్ను క్షమించడు."

"నన్ను క్షమించు శంకర్"

శంకర్ ఏం మాట్లాడలేదు. కారు వేసుకుని సరాసరి హాస్పిటలుకు వచ్చాడు.

డ్యూటీ నర్సు యితన్ని చూడగానే

"ఈవినింగ్ డాక్టర్" అని అంది.

"ఈవినింగ్ సిస్టర్" అంటూ లోపలికి వెడుతున్నాడు.

"ఎమర్జెన్సీ ఏమైనా వుందా ?"

"లేదు"

"విజయ సినిమాకు వెళ్ళింది"

కారు సినిమాహాలు చేరింది, సినిమానుంచి వస్తున్న విజయ, వాళ్ళన్నయ్య కనిపించారు. ఇతన్ని చూడగానే అతను "హల్లో! డాక్టర్" అని పలుకరించాడు.

"నేనుమీతో ఒక విషయం మాట్లాడాలి"

"ఇంటికి వెళ్ళి మాట్లాడుకుందాం"

"మీకు అభ్యంతరం లేకపోతే బీచికి వెడదాం'

"అల్లాగే."

బీచి చేరగానే శంకర్.

"నాగురించి, విజయ మీతో చెప్పిందను కుంటాను"

"అంతా చెప్పింది. మా అందరికీ చాలా సంతోషం, అమ్మ మిమ్మల్ని ఒకసారి యింటికి తీసుకురమ్మన్నది"

"నేను యీ నెలలో, రాయవెల్లూరు వెడుతున్నాను రెండు మూడు నెలల దాకా రాకపోవచ్చు నేను వెళ్ళే లోపల. . . . ."

"చెప్పండి"

"మావివాహం కావాలని నాకోరిక"

"ఈ నెలలోనా ?"

"అవును"

"వ్యవధి చాలదేమో!"

"నాకేం పెద్ద ఆడంబరం అక్కర్లేదు. నాతరపున వచ్చేవాళ్ళు కొద్దిమంది, వాళ్ళకు యీవ్యవధి చాలు"

"రేపు సాయంకాలం మాయింటికి 'టీ' కి రండి అన్నివిషయాలు, అమ్మతో సంప్రదించుతాం" అని అతను కారువైపు నడిచాడు.

అతను వెళ్ళగానే, విజయ.

"నామీద ఆ మాత్రం నమ్మకంలేదా ?" అని అడిగింది.

"నమ్మకం లేంది, నీమీదకాదు, నా అదృష్టం మీద"

"ఎందుకని ? మీరు దగ్గరలేకపోతే, నామనస్సు మారిపోతుందనా ?"

"కాదు విజ్జి అంతమాట అనవద్దు. నిన్ను వదిలి ఒక్కక్షణం వుండలేక. . .నువ్వు నాభార్యవైతే, నువ్వుకూడా నాతోబాటు రావచ్చు, నిన్ను వదిలి రెండు నెలలుండటం, నాశక్తికి మించిన పని"

"క్షమించు. . . . .క్షమించండి"

"క్షమించవలసింది నన్ను"

మరునాడు ఉదయం, రాముని, ఆపరేషన్ థియేటరుకు తీసుకుపోతుంటే,

శంకర్ అతనిదగ్గరకు వెళ్ళి

"ఎల్లావున్నావు రాం" అని అడిగాడు

రాం కొంచెం సేపు ఏం మాట్లాడలేదు. చివరకు

"నాకు ఆపరేషన్ ఎవరు చేస్తారు" అని అడిగాడు.

"నేను కాదులే, భయపడకు,డాక్టరు చౌదరీ నిన్ను ఆపరేట్ చేస్తారు"

రాం కంటి వెంట నీరు తిరిగింది.

"నన్ను క్షమించు శంకర్" అని అన్నాడు.

శంకర్ చిరునవ్వు నవ్వి అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

ఆపరేషన్‌బల్లమీద రాం, డాక్టరు చౌదరీతో

"నాకు చాలా భయంగా ఉంది. డాక్టరుగారు నేను పోతే నాభార్య దిక్కులేనిదవుతుంది. దానికి ఎవ్వరు లేరూ"

"ఎందుకయ్యా భయపడతావు. నీకేం భయం లేదు. మీ మునిమనుమడి పెళ్ళి కూడా చూస్తావు"అనిఅంటూ క్లోరోఫారమ్ యిచ్చాడు

ప్రక్కగదిలోకి వెళ్ళి "డాక్టర్" అని పిలిచాడు.

డాక్టర్ శంకర్ వచ్చాడు.

రెండుగంటలు మృత్యువుతో పోరాడి జయించాడు. శంకర్ బయటకు రాగానే, కమల కళ్ళల్లో కనబడిన ప్రశ్న "ఎల్లా వున్నారు ?"

"ఏం ఫర్వాలేదు. ఇంకా వందసంవత్సరాలు బతుకుతాడు"

"శంకర్! శంకర్ " అంటూ అతని పాదాల మీద వ్రాలింది.

అతనేం మాట్లాడలేదు. రెండడుగులు ముందుకువేసి, ఒక్కక్షణం, ఆగి.

"కామూ" అని మెల్లిగా పిలిచాడు.

ఆపిలుపుకు ఆవ్యక్తి ఒక్కసారి వులిక్కిపడ్డది. ఏదోయింకొక లోకంలోంచి వచ్చినట్టుంది ఆ పిలుపు.

"కామూ!" తన హృదయాన్నీ కానుకగా యిచ్చిననాడు శంకర్ తనని అల్లాగే పిలిచాడు.

"నేను ఆపరేషన్, చేసినట్టు మాత్రం, రాముతో చెప్పవద్దు. వాడు, ఆదెబ్బకు తట్టుకోలేడు" అంటూ బయటికి నడిచాడు ★

